# పాఠకులు కుశలమా!

మధురాంతకం రాజారాం

Ramesh Photogravure

అసలు సిసలైన ఉన్మాదంమాట కేమి గానీ, దాని నీడల్నిమాత్రం పరికిస్తే పిచ్చి వెయ్యిరకాలు. ఒకటి రెండు గంటలపాటు 'పుస్తక'మంటూ పేర్కొనదగిన వస్తువు కంటికి కనిపించకపోతే మతిపోయినట్టుండడం అలాంటి ఉన్మాదచ్ఛాయల్లో ఒకటిగాకపోదు. ఆ ఊరిలో, ఆ చలికాలపు సాయంకాలంవేళ నా కెదురైన పరిస్థితిగూడా అదే!

నే నా వూరికి వెళ్ళింది రాయదుర్గం నరసప్పగారిని కలుసుకోడానికి కాదు; అసలాయన ఆవూరిలో వున్నాడని నాకు తెలియదు. ఏదో స్వకార్యంమీద ఆవూరు వెళ్ళడం జరిగింది. వెళ్ళడమే తడవుగా పని ముగిసింది. కానీ వెనువెంటనే తిరిగి రావడానికిమాత్రం వీల్లేకపోయింది. అది చాలా చిన్నకుగ్రామం. దానికీ ప్రపంచానికీ వున్నలంకె ఒక్కటే బస్సు. అది ఉదయం పన్నెండు గంటల కక్కడికి వచ్చి, వెంటనే తిరుగుదారి పడుతుంది. మూడువైపులా కొండలు; ఓవైపున రోడ్డు. రోడ్డు కొక ఫర్లాంగు దూరంలో వూరు. మామిడితోటల గుబుర్ల వెనుక నక్కి కూర్చోడంవల్ల అక్కడొక వూరుందన్నసంగతి, ఆవూరిలోకి వెళ్ళిన తర్వాతగానీ తెలియదు. వెలుగుముఖం చూడకుండా, భూగర్భంలో ఎంతకాలం మనవచ్చునన్న విషయంపైన యిటీవల కొందరు శాస్త్రజ్ఞులు పరిశోధనలు కల్పించినట్టు వినికిడి. వార్తాపత్రికా, రేడియో, సినీమా మొదలైన వ్యాపకాలేవీ లేకుండా మానవులు అచ్చమైన ప్రకృతిమాత బిడ్డల్లా బ్రతకవచ్చునని నిరూపించడానికి ఆవూరి నొక ప్రయోగశాలగా రూపొందించారేమో తెలియదు. ఏ దూరపు బంధువుతోనైతే పనిబడి, ఆవూరికి వెళ్ళానో, ఆ దూరపుబంధువు బహుకార్యవ్యగ్రుడు. అతిథిసత్తముడి పట్ల ఎంతగా గౌరవాభిమానా లున్నప్పటికీ, పాపమతనికి పదినిమిషాలపాటు నింపాదిగా మాట్లాడడానికి తీరిక చిక్కడంలేదు. అది బొత్తిగా రైతుల ఇల్లు. కిటికీలు తక్కువ. ఉన్న కిటికీలు గూడా మూయబడివున్నాయి. ఏనాటి పాలగారోగానీ అది మాసిపోయి, నల్లటి గచ్చులా తయారైంది. పెద్దల వాడుకలో





అలాంటి యిళ్ళపేరు 'చుట్టుభవంతులు'. నవనాగరిక ప్రపంచంలో మారిన, మారుతున్న యిళ్ళతో దానికి పోలికలేదు. పేటకూ, పట్టణానికీమధ్య త్రిశంకుస్వర్గంలాంటి పరిణామదశలో ఉక్కిరి బిక్కిరౌతున్న నా స్వస్థలంలో సరిగ్గా ఇలాంటి యిల్లే నాకుంటే యిందులో ఏయేతావుల్లో పుస్తకాలు పేర్చిపెట్టడానికి వీలుంటుందో అలాంటి తావులన్నింటిలోనూ నాచూపులు పుస్తకాలకోసం గాలించాయి. అలమరాలో గుమ్మడిపళ్ళు; జాజికాయల పెట్టెలో త్రాళ్ళు, తోళికలు; దేవరింటిలో తలుపుచెక్కలపైన గోడ కానించిపెట్టిన బెల్లంముద్దలు; ఇంకా ఎర్రగడ్డల గుత్తులు. మర్రాకుల తోరణాలు...

ఇంతలో ఏపారకోసమో, పలుగు కోసమో గృహస్థుడు లోపలికి వచ్చాడు. వస్తూ "ఏమిటో పరకాయించి చూస్తున్నట్టున్నారు," అన్నాడు.

"మరేంలేదు. కాలక్షేపంకోసం ఏదైనాపుస్తకం దొరుకుతుందేమోనని."

"పుస్తకాలా! ఆ పంట మా పొలాల్లో పండడంలేదండీ బావగారూ? అంతగా మీకు కావలసివస్తే రాయదుర్గం నరసప్ప గారిదగ్గరకు మనిషిని పంపాలి..."

రాయదుర్గం నరసప్పగారు!

లోకమంతా గొడ్డుపోయినట్టు ఆయన ఈవూరిలో వున్నాడా?

పగ్గాలు తెంచుకుని ఆవులు పొలాల్లోకి జొరబడినట్టుగా నా ఆలోచనలు గతంలోకి పరుగుతీశాయి.

మూడు దశాబ్దాలకిందటి మాట. ఒకానొక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయనను మొదటిసారిగా చూశాను. చూచినప్పుడు ఆయన అక్కడి తెలుగు పండితుడని తెలియదు. కోరమీసాలు, పద్ధతి లేకుండా కట్టుకున్న తలపాగా, పొడుగాటి కోటు, మెడకు రెండుచుట్లు తిరిగి యిరువైపులా క్రిందికి వ్రేలాడుతున్న అంగవస్త్రము, పాదాలకు కిర్రుచెప్పులు. పండితుడైతే అయ్యాడుగానీ, ఆయన అందుకు తగ్గవేషాన్నిమాత్రం సంతరించుకున్నట్టుమాత్రం లేదు. వేషం కన్నా వాచికమూ, అంగికమూ ముఖ్యమైనవే! కాదనలేము. కానీ మొట్టమొదట కంటికికొట్టవచ్చినట్టు కనిపించేది వేషమే! నరసప్పగారు పాఠం ఎలా చెప్పగలరో ఆ పనికి ఆయన ఎంతగా తగుదురో లోకులకు తెలియదు. వారి దృష్టిలో ఆయన పరసలో ఎద్దుల బేరగాడిలా వుండేవాడు. బటవానంచీ భుజానికి తగిలించుకుని సంతకు వెళ్తున్న పెదకాపులా వుండేవాడు.

అది జిల్లాకేంద్రంలోని ఏకైక ఉన్నతపాఠశాల. జిల్లాలో పది పన్నెండు మిడిలిస్కూళ్ళుండేవి. మిడిలిస్కూల్ నుంచి హైస్కూలుకు వెళ్ళడమంటే, ఈనాడు యింజనీరింగులో సీటు దొరికినంత సంబరంగా వుండేది. పోర్తు


పారంలో చేరిన నెలనాళ్ళకే నరసప్పగారు నన్ను తన అభిమాన శిష్యుల జాబితాలో చేర్చుకున్నారు. వేపమాను వీధిలో దర్గా వెనుకవైపునవున్న యింట్లో నరసప్పగారి కాపురము. మళ్ళీ నాలుగైదువీధులు దాటి వెళ్ళవలసివున్నందున, నేను ఆయన పుస్తకాలను తీసుకెళ్ళడానికి ఉపకరించేవాణ్ణి. ఆ కించిత్తుపనిని నాపైన మోపడానికిగూడా ఆయనకు మనస్కరించేది గాదు. 'ఒరే అబ్బీ! నువ్వు వ్రేలెడంతలేవు. నా పుస్తకాల బరువుక్రింద నువ్వు నలిగిపోవడం నా కిష్టంలేదు' అనేవాడాయన.

నరసప్పగారి వెంట నడవడానికి అలవాటుపడిన క్రొత్తలో నా కొక విషయం తెలిసింది. ముందువైపున మాత్రమే దీపాలు వెలుగుతున్న కారులాంటివాడు నరసప్పగారు. కన్నెదుట కనిపించేది కాంతి, వెన్నంటి వ్యాపించేది చీకటి. నరసప్పగా రెదురు రాగానే భయభక్తులు ముఖంలోకి తెచ్చుకుని నమస్కారాలు వల్లించేవా ళ్ళందరూ. ఆయన తమను దాటుకోగానే వెకిలి నవ్వులు నవ్వుకునేవారు. ఆ వెకిలి నవ్వుకు అంతరార్థ మేమిటో నా కాదిలో తెలిసిందిగాదు. క్రమక్రమంగా కారణాలు బోధపడుతూ వచ్చాయి. నరసప్పగారు నిఖార్సయిన పండితుడు కాడన్నది మొదటికారణం. నేతిబీరకాయలా, కాకి బంగారంలా ఆయన నకిలీ పండితుడని తాత్పర్యం. నరసప్పగారు జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారిని దర్శించి ఆయనగారిపైన పంచరత్నాలు చదివారు. ఆయన తెగమురిసిపోయినవాడై నూటపదహార్లు సమర్పించుకోబోయాడు. 'అబ్బే నాకు డబ్బెందుకండీ! పండితపదవి నిప్పించండి' అన్నాడు నరసప్పగారు. అలాగే బొమ్మని ప్రెసిడెంటుగారు వరప్రదానం చేశారు. రెండోకారణం: ఆయన పాఠాన్ని పాఠంలా చెప్పడు. పురాణంలా చెబుతాడు. మూడోకారణం: ఏ పాతకాలంనాటి పరీక్షలోనో కడతేరి పండితుడు కావడానికి కనీసపు అర్హతను సంపాదించుకున్నాడంతేగానీ, ఆయన సాంగోపాంగంగా బడిలో చదువుకున్న పాపాన పోలేదు. అందువల్ల ఆయనకు విద్యార్థులను పరీక్షలకు తయారు చెయ్యడము తెలియదు. నాలుగో కారణం: ఆయనకు యింగ్లీషులో సంతకం పెట్టడమైనా చేతగాదు.

నరసప్పగారి పట్ల బడిలో ఎంతగా తేలికభావాలు వ్యాపించి వున్నప్పటికీ స్వభాషాభిమానుల పాలిటికి ఆయన యిల్లొక తీర్థవాటికలా కనిపించేది. పండుగలకు పబ్బాలకు అక్కడ కావ్యగానాలు కొనసాగేవి. ఎంతో కొంత సాహిత్యాభిమాన మున్న పురజనులు గూడా కొందరు వాటిల్లో పాల్గొనేవారు. వారిలో ఎవరైనా 'అబ్బో, తెలుగు బలగం చాలా పెద్దదే!' అంటే,








'బలగం కాదండీ! ఇది తెలుగు పేరోలగం' అంటూ నరసప్పగారు సరిదిద్దేవారు. ఆ చెప్పడానికి కావలసిన పాఠం చెప్పడంకన్నా, సాధనసంపత్తిని సమకూర్చుకోడంకన్నా, ఆత్మస్తుతికీ పరనిందకే కాలాన్ని ఎక్కువగా సద్వినియోగం చేసుకునే పద్ధతి నరసప్పగారికి అలవడిందిగాదు తీరిక దొరికినపుడల్లా ఆయన బుద్ధి పద్యాల అల్లికపయిన పరిశ్రమిస్తుండేది. కవితాసరస్వతికి రోజు కొక్క పద్యమైనా ఉపాయనంగా సమర్పిస్తేగానీ ఆయనకు నిద్రపట్టేది కాదు. లౌకిక విపణివీధిలో రత్నాలకున్న గిరాకీ చాలా తక్కువ. బొత్తిగా లేదన్నా తప్పులేదు. మరయితే అంతటి దీక్షతో పెంపొందించుకుంటున్న ఈ పద్యసంచయాన్ని ఆయన ఏం చేసుకోబోతున్నా డన్నదే నా కర్థంగాని విషయం.

బడి విడిచిపెట్టి ప్రపంచంలోకి రావడంతో భౌతికంగా నరసప్పగారికి దూరంగావడం జరిగింది. అయినా ఆయన జీవితవిశేషాలు అప్పటికప్పుడు గాకపోతే మానే, కొంత ఆలస్యంగానైనా తెలిసివస్తుండేవి. అయిదారేళ్ళ వ్యవధిలో ఆయన స్వంతడబ్బు వెచ్చించి నాలుగైదు కావ్యాలను ముద్రించారు. వాటిలో ఆయన అమ్ముకోగలిగినవి స్వల్పం. ఉచితంగా పంచిపెట్టినవాటి సంఖ్య అనల్పం. అలా ఉచితంగా పంచిపెట్టడానికైనా మనుషులు దొరక్క ఎన్నో పుస్తకాలు బీరువాల్లో మ్రగ్గిపోతూండేవి. ఈ మొదలుచెడ్డ బేరం నిశ్చలకాసారం లాంటి ఆయన చిత్తవృత్తిపైన మానని గాయంలా దెబ్బదీసింది. ఇతిహాసాలకూ, ప్రబంధాలకే దిక్కులేదు. ఇక తన కావ్యా లెవరు చదువుతారు లెమ్మన్న నిరాశా నిస్పృహలు ఆయనను చుట్టుముట్టాయి. సందు చూచుకుని పుస్తకాల వ్యాపారులు

కొందరు ఆయనను దగా చెయ్యడంలో కృతకృత్యు లయ్యారు. సాహిత్యాభిమానిగా పేర్గాంచిన పెద్దమనిషి ఒకతను ముద్రణాభారం వహించగలనన్ని నమ్మబలికి కొన్ని వ్రాతపుస్తకాలను పట్టుకెళ్ళి, దినం మంచిదని పగలే దొంగతనానికి దిగినట్టుగా వాటిని తన పేరుతోనే అచ్చు వేయించుకున్నాడు. పులిమీద పుట్రలాగా ఎన్నడూ లేనిది నరసప్పగారు కొంత అనారోగ్యానికి గూడా గురయ్యారు. మూడు మాసాల ధీర్ఘకాలం సిక్‌లీవు పెట్టి యింటిదగ్గరే గడపవలసివచ్చింది. ఆ సందర్భంలో ఒకసారి ఆయనను చూడ్డానికి వెళ్ళాను. అప్పుడప్పుడే ఆయనలో బట్టతల లక్షణాలు పొడసూపుతున్నాయి. గడ్డం దట్టంగా పెరిగింది. ఆ సంవత్సరం ఆరునెలల పొడుగునా జడివానలు కురిసి ఆయన కాపురమున్న యింటిలో పెరటివైపున రెండు గదులు కూలిపోయాయి. తీసుకెళ్ళిన చీనీపళ్ళు ఒలిచిపెడుతూ, యిల్లు మార్చడం మంచి దేమోనని సూచించాను. ఆయన నీరసంగా నవ్వారు. "ఒరేయ్ రాజూ! ఇల్లేకాదు, ఊరే మార్చవలసివచ్చేటట్టుంది," అన్నాడు.

"ఎందుకండీ?" విస్మయంతో ప్రశ్నించాను.

"ఎందుకంటే - ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములు వాడిగనుక! నీకు తెలియదేమో, యిప్పుడు స్కూలు కొక క్రొత్త తెలుగుపండితుడు వచ్చాడు. మడిమలదాకా తొడుక్కున్న పొడుగాటి షరాయివాడు, చొక్కా నందులోనే దోపుకున్నవాడు, వుంగరాల జుట్టువాడు, తూనీగ మీసాలవాడు. మీ యింగ్లీషు మాష్టార్లందరూ అతగాడి ముందు బలాదూరు..."

"కానివ్వండి, మన కేం నష్టం?"

"లాభ నష్టాల ప్రసక్తిగాదు. ఆత్మాభిమానం కృంగి కుంచించుకపోతుంటే ఎలా భరించడం? క్రొత్త పండితుడు వచ్చాడన్నానుగదూ! అయ్యవార్లకందరికీ అతడి వాలకం నచ్చింది. వెంటనే నామాలుపెట్టి, వైష్ణవం యిప్పించి తమ మతంలో కలిపేసుకున్నారు. ఎటొచ్చీ వెలివేయబడ్డవాణ్ణి నే నొక్కణ్ణే."

"ఇదిగూడా మీకు క్రొత్తగా ఎదురైన యిబ్బంది కాదే!"

"నీకు తెలియదట్రా రాజూ! మూరెడెచ్చా తక్కువా అయితే నేను లెక్కపెట్టేవాణ్ణిగాను. ట్రాక్టరులా దున్నుకపోయేవాణ్ణే! కానీ తా మేమో గిరిశృంగాలపైన నిల్చున్నట్టు, ఎదుటివ్యక్తి అగాధంలో పడివున్నట్లు భావించి, ఆ భావనకు తగ్గట్టుగానే ప్రవర్తించేవాళ్ళతో ఎంతకాలం బ్రతకగలం? పితూరీలు చెప్పడం నాకు చేతగాదని నీకు తెలుసు. కానీ ఒక చిన్న దృష్టాంతం చెబుతాను. స్కూలు కీమధ్యనే రేడియో ఒకటి కొన్నారు. అందులో ఓపాటవినవస్తోంది.







నే నూరుకోలేక అది గీతగోవిందంలోవిదన్నాను. 'కాదండీ! అది ఫలానా సినిమాలోనిః' అన్నాడు క్రొత్త తెలుగు పండితుడు. 'ఆ విషయం నాకు తెలియదు. ఆ పాటమాత్రం గీతగోవిందంలోనిదే! నేను చూచాను' అన్నాను. 'అలాగా! ఆ సినమా నేను చూడలేదు' అన్నాడు క్రొత్త తెలుగు పండితుడు. అని, అంతటితో ఎక్కడూరుకున్నాడు? కలలోనుంచి తటాలున మేలుకున్నట్టుగా 'అబ్బే, మీరు పొరబాటు పడుతున్నారండీ! ఆ పేరుతో సినిమా రానేలేదు' అన్నాడు. ఎదుటివ్యక్తిని చిత్తుచిత్తుగా ఓడించేశాడు గదూ! బల్లల్ని చిదకబాదేస్తూ సహోపాధ్యాయుల దొకటే చిరునవ్వు..."

రాజహంసను చూచి కొంగలు నవ్విన కథ జ్ఞప్తికి వచ్చింది. నరసప్పగారు చెప్పుకపోతున్నారు.

"విస్సన్న చెప్పిందే వేదం. నువ్వూ నేనూ చెబితే అది వేదం ఎలాగౌతుంది? వచ్చినవాడు సీనియరు తెనుగుపండితుడు. ఆ మాట నువ్వూ నేనూ చెప్పిందిగాదు; పై అధికారులే చెప్పారు; నమ్మకపోవడం ఎవడితరం? నేను కనీసం జూనియర్ తెనుగుపండితుణ్ణయినా కాను. అన్‌ట్రెయిన్డ్ జూనియర్ పండితుణ్ణి - యింగ్లీషు రాకపోవడంవల్ల; యోగ్యతాపత్రాలు లేకపోవడం వల్ల! నా జీతముంది చూచావూ, అది మాచకమ్మ! దానికి ఎదుగూ, బొదుగూ లేదు. పోగా

పాత హెడ్మాస్టరుగారి హయాంలో అదొక రకంగా వుండేది. ఆయన వయోవృద్ధుడు. ఆయన అన్నా, నేను విన్నా అంత బాధగా వుండేదికాదు. ఆయన స్థానంలో ఓ కుర్ర హెడ్మాస్టరు వచ్చాడు. ఈయనకు అయ్యవార్లు సక్రమంగా పాఠాలు చెప్పడంకన్నా, తనకు లొంగి వుండడం ముఖ్యం. నీ శరీరం నీదే నని నువ్వనుకుంటావు. అది వట్టి భ్రమ. అది హెడ్మాస్టరుగారి కదలికలకు అనుగుణ్యంగా తనను తాను మలచుకునే ఒక సజీవయంత్రం. హెడ్మాస్టరుగారు కనిపించాడుటో, అది తలకిందికి వంచి, కుడిచేతిని పైకెత్తాలి. హెడ్మాస్టరుగారు రౌండ్సు వచ్చాడుటో, అది షాకు తిన్నట్టుగా లేచి నిల్చోవాలి. హెడ్మాస్టరుగారు నోరు తెరిచాడుటో, అతడి మాటలలో లేని ఛలోక్తిని గూడా గుర్తించి, ఇది గూడా నోరుతెరచి చిరునవ్వులు ఒలకబోయాలి. అమాత్రానికే తృప్తిపడక ఈ శరీరాలను మరింతగా తన ఆదుపులోకి తెచ్చుకోడానికి వీలుగా, వాటికి తగిలించవలసిన దుస్తులను గూడా నిర్దేశిస్తూ ఈ హెడ్మాస్టరుగారొక చట్టాన్ని జారీ చేశాడు. నిజానికి అలాంటి దుస్తులు ధరించుకోడం చాలామంది కిష్టంలేదు. కానీ వాళ్ళందరూ కలిసి ఓ చిట్కా కనిపెట్టారు. 'మొట్టమొదట నరసప్పగారు గనుక ఈ నియమాన్ని ఆచరణలోకి తెస్తే, వెనువెంటనే మే మందుకు తయార్' అంటూ వాళ్ళు హెడ్మాస్టరుగారికి విన్నవించుకున్నారు. ఇక చూచుకోరా రాజూ! మెమోలకుపైగా మెమోలు నాకు! ఏం చెప్పమంటావురా బాబూ! ఆలు చచ్చిననాడే అందరికీ లోకువ..."

"అన్నారూ! అంతమాట కూడా అన్నారూ?" అంటూ తులసమ్మ గదిలో ప్రవేశించింది. అమంగళం శాంతించాలని నేను మనసులోనే అనుకున్నాను.

"ఐనా నాకీ దండన రావలసిందేరా రాజూ! మొదట తెలుగు పండితుణ్ణి అయినందుకు, అంతకంటె ముందుగా పెద్దలు వెళ్ళిన దారంట వెళ్ళనందుకు, బెస్తవీధిలో పువ్వులదుకాణం పెట్టినందుకు నాకీ శిక్ష కావలసిందే! కుర్రవాళ్ళకు సాహిత్యం నూరిపోయాలనీ, కావ్యాలు వ్రాద్దామనీ, తద్వారా శారదోపాసన చేద్దామనీ నే నెన్నో కలలుగన్నాను. ఆ కలలన్నీ కల్లలైపోయాయి. ఇదిగో, ఈ యిల్లు కూలినట్టుగానే నా ఆశలుకూడా కూలిపోయాయి. ఇక నే నీ యిల్లు ఖాళీ చేశానంటే, ఈ ఉద్యోగం వదలిపెట్టినట్టే!''

అది పన్నెండేళ్ళ క్రిందటిమాట. నరసప్పగారు అనడమేగాదు, అన్నంత పనిగూడా చేశారు. ఉద్యోగానికి రాజీనామా యిచ్చినతరువాత ఆయన ఏమైందీ, ఎక్కడికి వెళ్ళిందీ తెలియదు.

కాలప్రవాహంలోపడి, ఏదో ఒక పాయవెంట వెళ్ళిపోతూ, ఆనాడూ కను









మరుగైపోయిన ఆపదవ మళ్ళీ ఈనాడు యిక్కడ తేలిందని తెలియగానే నామనసు వేగిరపడిపోసాగింది. నా కాళ్ళు నన్ను అప్రయత్నంగా నరసప్పగారి సన్నిధికి తీసుకెళ్ళసాగాయి.

* * *

తీరా వెళ్ళేసరికి నరసప్పగారు యింట్లో లేరు. భార్యమూలంగా ఆయన ఆచూకీ తెలిసింది.

పల్లెకు వెనుకవైపున ఓ అరమైలు దూరంలో గుట్టఒకటి కనిపిస్తుంది. గుట్ట చుట్టూ వందలసంఖ్యలో వూడలు దిగిన మర్రిచెట్లున్నాయి. ఆ వటవృక్ష సముదాయానికి పెట్టని కోటలా మద్దులూ, నేరేళ్ళూ బారులు తీర్చివున్నాయి. ఈ వృక్షపంక్తికి ఆనుకుని సన్నని ఏరొకటి ప్రవహిస్తోంది. ఆ ఏటి కిద్దరిని కొన్ని మామిడిచెట్లు; ఆ మామిడిచెట్ల దగ్గిర నుంచే ప్రారంభమౌతుందట నరసప్పగారి తోట...

ఆ మామిడిచెట్లసంఖ్య కొద్దిపాటిది. ఐతేనేమి, ఏపుగా పెరిగి శతసహస్రానేక శాఖలతో దశదిశలకూ వ్యాపించి, మొదళ్ళదగ్గర యిద్దరుమనుషులు బారలు సాచినా మిగిలిపోయేంతటి బలుపుతో, ఎలాంటి ఝంఝూమారుతానికైనా తల వంచని తీవిని మోరుస్తూ అవి గంభీరంగా నిల్చివున్నాయి. ఆ మామిడిచెట్లనుగూడా పొదివిపట్టుకున్నట్టుగా వ్యాపించివున్న దట్టమైన కంచె కక్కడ వేయబడివున్న వెదురుతడికల తలుపును తీసుకుని మెల్లిగా లోపలకువెళ్ళాను. ఎండిపోయిన మామిడాకు పరుపులకు మధ్య సన్నగా వంకరలు తిరిగిపోతున్న కాలిదారివెంట దాదాపుగా నూరంగలు వేసినంతదూరం నడిచాను. అక్కడికి మామిడిచెట్ల నీడ ఆఖరైపోయింది. ఎట్టఎదుట ఎత్తుగా పోసివున్నది ఓ మట్టిగనుమ. గనుమపైకెక్కి నిల్చున్నాను. కనుచూపు ఆనినంతమేరకు భూదేవి పచ్చనిచీర కట్టుకున్నట్టున్న పంటపొలాలు. ఆ పొలాల మధ్య నరసప్పగారికోసం నా చూపులు ఆతురతగా వెదకుతున్నాయి.

గొంతు వినిపించింది.

"ఎవరక్కడ? ఇదిగో, యిక్కడున్నానురా అబ్బీ!"

తిరిగిచూచాను.

అవే కిర్రుచెప్పులతో, అదే ముక్కాలు చేతుల చొక్కాతో, కప్పుకున్న శాలువాతో, నెరసిపోయిన బొద్దుమీసాలతో, దుడ్డుకొయ్యలాంటి చేతికర్రతో అరటిచెట్లనడుమ నిల్చున్న నరసప్పగారు కనిపించారు.

"నమస్కారమండీ మేష్టరుగారూ! మీ రీ వూరిలో వున్నారని ఓగంట క్రిందట తెలిసింది. ఇక్కడున్నారని పదినిమిషాలక్రిందట తెలిసింది. హాలికులకు కుశలమేనటండీ మేష్టరుగారూ?"

"నువ్వట్రా రాజూ! భద్రంగా రావాలి

మరి. క్రిందికి చూడకుండా నడిస్తే గనుమపైన కాలు జారుతుంది..."

క్రిందికి దిగి, చిన్నకాలువ నొకదాన్ని దాటుకుని సన్నటి గనుమపై కొచ్చేశాను. స్వాగత మిస్తున్నట్టుగా నాలుగడుగులు ముందుకువచ్చి, భుజంపైన చేయి వేసి నన్ను దగ్గరికి తీసుకుంటూ "అబ్బ! ఎంతకాలానికిరా రాజూ!" అన్నారు నరసప్పగారు. ఒకటి రెండుక్షణాల తర్వాత "నిన్ను కలుసుకోడం కోసం మాత్రమేగాదు. 'హాలికులకు' కుశలమా అంటూ ప్రశ్నించావుగదూ; అలాంటి ప్రశ్నకోసంగూడా ఎంతోకాలంనుంచీ వేచివున్నాను..." అన్నాడు.

"అలాగటండీ మేష్టరుగారూ! ఐతే అడగవలసిన ప్రశ్నే అడిగానన్నమాట!"

"కానీ యిందుకు నువ్వు నన్ను జవాబు చెప్పనివ్వాలి మరి..."

"అంతకంటేనా? మిగిలిన వివరాలు కావలిస్తే తీరిగ్గా అడిగి తెలుసుకుంటాను. మొదట నేను తెలుసుకోదలచిన విషయం యిదే!"


"అందుకే చెబుతున్నాను. వ్యక్తి స్వాతంత్ర్యం వున్నదేశంలో ఎవరి కిష్టమైనవృత్తిని వారు స్వీకరించవచ్చు. హాలికుడు కవిఅయినా, కవి హాలికుడైనా అందులో విడ్డూర మనిపించే దేమీ కనిపించదు. కానీ హాలికులకు కుశలమా అన్నప్రశ్నలో నిగూఢంగా దాగివున్నది వట్టి పరామర్శగాదు - ఎత్తిపొడుపు. 'కవిగా ఉదరపోషణ జరగకపోవడంవల్ల, తప్పనిసరిగా మేడిపట్టుకోవలసివచ్చిన ఓ మాజీకవీ! ఈ వృత్తిలోనైనా నీకు రోజులు సుఖంగా వెళ్ళమారిపోతున్నాయా?' అంటూ సూటిగా అడగలేక, యిలా ప్రశ్నిస్తున్నావు నువ్వు. కాదనగలవట్రా రాజూ?"

"ఏమిటోనండీ మేష్టరుగారూ! నేనంతదూరం ఆలోచించలేదు." అన్నాను.

"మరులు చాలా చెడ్డదిరాబాబూ! దూడ చనిపోయిందనుకో, చేతపెయ్యను చేసిపెడితేగానీ ఆవు పాలు చేపదు... ధర్మపత్నిని అరణ్యాలకు పంపించేశాడు బో, శ్రీరాముడు సరిగ్గా సీతమ్మలాంటి పుత్తడిబొమ్మను చేసిపెట్టుకోక తప్పింది గాదు. పూర్వాశ్రమంలో నేను కవిగా, పండితుణ్ణిగా, అధ్యాపకుణ్ణిగా బ్రతకడానికి ప్రయత్నించాను. అక్కడ తిండికి తిరకాసే; సుఖశాంతులకూ నిప్పచ్చరమే! ఆ బ్రతుకును కాదనుకుని యిల్లా ఈ అజ్ఞాత ప్రపంచంలోకి వచ్చేశాను. ఇక్కడ చేతినిండుకూ పనీ, కడుపునిండుకూ బువ్వా దొరుకుతున్నయి నాకు! కానీ మనసుకేదో కొరత, బుద్ధికేదో మాంద్యం, అంతరంగానికేదో క్షోభ ఎదురు కాసాగాయి. మనిషి స్వభావానికీ, వాడు చేస్తున్న పనికీ సామరస్యం లేకపోతే, బ్రతుకు బ్రతుకంతా ఒక తీవ్ర సంఘర్షణగా పరిణమిస్తుందేమో! సరిగ్గా అలాంటి పరిస్థితే ఎదురైంది నాకు! ఒక








విధంగా అదొక ఉన్మాదంలాంటి స్థితి. అందులోనుంచి కోలుకోడానికి చాలా కాలం పట్టింది..."

"ఎలా కోలుకున్నారు?" అప్రయత్నంగా ప్రశ్నించాను.

"అదే చెబుతున్నాను. ఇరుసుకూ, చక్రానికీ ఎనాటికీ ఘర్షణ తప్పదు. కాదంటే యిరుసుకు కందెనవేసి ఘర్షణను మనం అదుపులోకి తెచ్చుకోవచ్చు. నే నదే పని చేశాను. దేనినుంచి దూరమైపోవడంవల్ల పెన్నిధిని పోగొట్టుకున్నట్టుగా బాధపడ్డానో, ఆ కావ్యజగత్తునంతటినీ తీసుకొచ్చి, ఈ పొలాల్లోనే నెలుకొల్పుకున్నాను..."

చుట్టూరా కలయజూస్తున్నాను. ఏ వైపు చూచినా చెట్లు, తోటలు, పైర్లు, కూరగాయలపాదులే కనిపిస్తున్నాయి.

"ఇదిగో, యిక్కడున్నాయే - ఈ చెట్లు ఎలా కనిపిస్తున్నాయి నీకు?"

'అవి కొబ్బరిచెట్లు-ఎలా కనిపిస్తాయి? కొబ్బరిచెట్లలాగానే కనిపిస్తున్నాయి. వరుస కారుచొప్పున మూడు వరుసల్లో మూడార్ల పద్దెనిమిది కొబ్బరిచెట్లు...'

"ఒక్కొక్కచెట్టు ఒక్కొక్క పర్వం చొప్పున యిదే నా పొలాల్లో నేను ప్రతిష్ఠించుకున్న మహాభారతం. రాతిలో భగవంతుణ్ణి చూడగాలేనిది, స్థావరజగత్తులో సాహిత్యజగత్తును చూడడం అబ్బరమట్రా రాజూ!"

ఆయన కది అబ్బరం గాకపోవచ్చు కానీ నా మట్టుకు నేను మాత్రం నా నివ్వెరపాటును కప్పిపుచ్చుకోలేకపోయాను.

"వివరించి చెప్పకపోతే నాకు నిజం

గానే పిచ్చిపట్టిందని నువ్వనుకోవచ్చు. నా కారణా లేవో నా కున్నాయి. నాకు తెలిసిన సాహిత్యప్రపంచంలో భారతం కన్నా ఉన్నతసృష్టి కానరాదు. అలాగే మహోత్తాలమైనవి ఈ కొబ్బరిచెట్లు. ధర్మాధర్మాల మధ్య జరిగే పోరాటానికి ఈ జగన్నాటకరంగం ఒక నిరంతర క్రీడావేదిక. అందులో ఎన్నటికైనా ధర్మానికే విజయమని నిరూపిస్తున్నట్టుగా ఆ ధర్మరాజు, ఆ భీముడు, ఆ అర్జునుడు మొదలైన పాత్రలు కొండ కొమ్మల్లా కనిపిస్తాయి. జాతిలోని నీతికీ బలానికీ ఊపిరిపోసే నమ్మకం యిది. తల పైకెత్తుకుని నిల్చున్న ఈ కొబ్బరిచెట్లు అరమైలు దూరంనుంచీ ఎక్కడ నిల్చుని చూచినా కనిపిస్తాయి. బ్రతుకు సాఫీగా గడచిపోవడానికి తిండీ గుడ్డా లాంటి కనీసపు జీవితావసరాలు కొన్ని కావాలిగదా! వాటివరకూ నీ కేం భయం లేదని హామీ యివ్వగలిగే నీ భూసంపద యిదిగో యిక్కడే వుంది అన్నట్లుగా ఈ చెట్లు నాకు నమ్మకం చెబుతుంటాయి."

"అర్థమైందండీ మేష్టరుగారూ!" ఈ మాటలు ప్రకాశంగానే అన్నానో, లేక స్వగతంగానే గొణుక్కున్నానో తెలియదు.

"ఈ అరటి చెట్లవైపు చూచావా రాజూ!"

చూస్తున్నాను. స్థానికంగా ఈ జాతి పేరు ఏడాకుల అరటి. ఏడెనిమిది మూరల ఎత్తువరకు పెరిగి, బాగా వెడల్పయిన పొడుగాటి ఆకులతో, నిండిపండిన వంబాలతో చల్లగా కడుపు పండించుకున్న ఆ కదళీతరువులు అందాలనూ, చల్లదనాలనూ వెదజల్లుతూ క్షేత్రేందిర కొక పవిత్రశోభను సంతరిస్తున్నాయి. ఎందుకైనా మంచిదని వాటినిగూడా లెక్కించుకున్నాను. కాలచక్రంలోని ఆకులకుమల్లే వాటి సంఖ్య సరిగ్గా పన్నెండు...

"ఊహించే వుంటావురా రాజూ! ఇదే నాదృష్టిలో భాగవతం. రోజు కొక అరటిపండు తింటుంటే వైద్యుడితో అవసరం వుండదని సామెత. రకరకాల వ్యసనంగాలతో బేజారెత్తిపోయిన మనసుకు భాగవతపారాయణమే దివ్యౌషధం. కళ్యాణాత్మకమైనవి విష్ణుకథలు. పళ్ళుగా, ఆకులుగా, పందిళ్ళకు అలంకృతిగా తమ సర్వస్వాన్నీ భగవత్కైంకర్యానికి వినియోగించుకునే అరటిచెట్లుమాత్రం కళ్యాణాత్మకమైనవిగావా?"

"మరైతే రామాయణం మాట ఏం చేశారండీ మేష్టరుగారూ?"

"తొట్టతొలుతనే రామాయణాన్ని గురించి చెప్పి వుండవలసింది_ఆదికావ్యం గనుక! ఐనా యిప్పుడు చెబుతున్నానుగా! పెట్టని చలువపందిరిలాంటి ఈ మామిడితోటే నాకు రామాయణం. రామకథను కొందరు అమృతమని సేవించారు. మరి కొందరు రత్నాకరమని గ్రుంకులిడి







దొరికిన రత్నాలు ఏరుకున్నారు. ఇంకా కొందరు కల్పవృక్షమని కామితార్థాలను యీడేర్చుకున్నారు. ఎందరెందరు ఎన్నెన్ని విధాలుగా కొనియాడినా తనివి తీరనిది రాఘవుని సచ్చారిత్రం. కష్టనష్టాల ఎదురుతాకిళ్ళతో- అసురుసురైపోయిన మానవులపాలిటికి అంతకంటే చల్లటి విశ్రాంతికేంద్రం మరి ఎక్కడుంటుంది చెప్పు..."

మాట్లాడుతూ నరసప్పగారు ముందుకు నడువసాగారు అక్కడ ఫలవృక్ష ప్రకరానికి మధ్యగా ఒక మారేడుచెట్టూ, దానిచుట్టూ ముచ్చటగా కట్టుకున్న ఒక రచ్చదిన్నె. దిన్నెపైన కూర్చుంటూ కొనసాగించారు నరసప్పగారు.

"ఈ బిల్వవృక్ష మేమిటో తెలుసా రాజూ! ముక్కంటికి ప్రీతిపాత్రం గనుక దీనిపేరు హరవిలాసం..."

"ఆలెక్కన మీ తోటలో ప్రబంధాలన్నీకూడా వున్నట్టేనటండీ మేష్టరుగారూ!"

"ఒకనాటి వుబలాటం కాదురా రాజూ! ఇది పది పన్నెండేళ్ళ శ్రమ. దక్షిణదేశాలకు తీర్థయాత్ర వెళ్ళినప్పుడు శ్రీరంగంనుంచి ఓ పనసమొలకను తీసుకొచ్చాను. అది యింతై అంతై యిలా ఒకపెద్ద చెట్టయింది. కావ్యాల్లో ప్రౌఢకావ్యం ఎలాంటిదో. చెట్లలో పనసచెట్టు అలాంటిది. అందుకే దీనిపేరు ఆముక్తమాల్యద. దాని కటువైపున వున్నది

ముంతమామిడిచెట్టు. మొదలేదో చివరేదో తెలియకుండా అల్లిబిల్లిగా ఓ పొదరిల్లులా గుబురుగా అల్లుకున్న కారణంచేత అది కళాపూర్ణోదయం మరి. యిటువైపున వున్న నిమ్మచెట్ల సమూహమే మనుచరిత్ర. ఎందుకంటే నీరెత్తిన నిమ్మ సుస్థిరత్వానికి ప్రతీక లాంటిది గనుక; నిమ్మ పూదుగాయ పైత్యప్రకోపానికి మంచి మందుగూడా! ఉచితా నుచితాలను గమనించకుండా దారంట వెళ్తున్నవాడిపైన మోహ వికారాలను వెదజల్లడం గూడా ఒక భావప్రకోపమేగదా! ప్రవరుని వైఖరి అందుకువిరుగుడు. పోగా ఆవైపునవున్న బొప్పాయిచెట్లు వరుసే పారిజాతాపహరణం. అందుకుకూడా కారణం లేకపోలేదు. పాదాలు రెంటింటితోనూ వామపాదమే అయివుండాలన్న పట్టింపులేదు. కుడి పాదంతో తన్నినాసరే. డోరపక్వం దాటిన బొప్పాయిపళ్ళు తటాలున తొటిమనుండి జారి క్రిందపడిపోయి..."

"మీరు చెబుతున్నమేరకు సాగుబడి వివరాలింకా పూర్తికాలేదు. మీ కేదారంలో పంటలింకా దండిగా వున్నట్టున్నాయి..." అన్నాను.

"నిజం, నిజం! ఇంకా శతకాలున్నాయి. వాటిల్లో రెండుతెగలు. భక్తిని పూలమొక్కలకూ, నీతిని కూరగాయల పాదులకూ ప్రత్యేకించాను. ఆ మల్లె పందిరుంది చూచావా! అది దాశరథి! ప్రతిదానికీ కారణాలు కారణాలంటూ దేవురించటానికి అలవాటు పడిపోయిన ఈ లోకానికి సంజాయిషీ చెప్పవలసిన అవసరం నాకేముందిరా రాజూ! నేను లోకానికేమీ బాకీపడిలేను. నాకిది కావాలని లోకాన్ని అడగను. ఐనా కొన్ని కారణాలు హృదయానికి మాత్రమే అందుతాయి. బుద్ధి కందవు. కానీ నీకు మాత్రం గుండెలోతుల్లోని అంతర్యాన్ని గూడా విప్పి చెప్పేయాలనే అనిపిస్తోంది. నల్లటి దేవుడికి తెల్లటి పూలైతే బాగుంటాయనుకున్నాననుకో! అవి నందివర్ధనాలు. నందీశ్వరుడికిమల్లే నందివర్ధనాలు గూడా ధూర్జటికి ప్రియంకరాలు గనుక ఆ పూల మొక్కలపేరు శ్రీకాళహస్తీశ్వరం; గన్నేరుపూలు నరసింహుడి మిడిగ్రుడ్లలా భయంకరంగా వుంటాయిగనుక ఈ గన్నేరుచెట్లపేరు నారసింహం,..."

నరసప్పగారు పైకి లేచారు. చెట్ల కీవలగా వచ్చి కంచెకు దాపునే వున్న గనుమవెంట నడవసాగారు.

"ఇక్కడ కంచె కల్లుకున్న కాకర పాదుంది చూచావా, దీన్ని వేణుగోపాల శతక మనుకున్నాను. 'పెట్టనేరని రండ పెక్కునీతుల పెద్ద – మధ్యవైష్ణవునికి నామాలు పెద్ద' అంటూ వరుసగా నిజాలు చెప్పడం ప్రారంభిస్తే నిష్ఠూరంగానే వుంటుంది; నిజం నిష్ఠూరమైనా ఒంటికి మంచిది. కాకరకాయలుగూడా అంతే! అక్కడ కంచెపైనుంచి





కానుగచెట్లలోకి అల్లుకున్న చిక్కుళ్ళలో మూడురకాల తీగలు ముప్పేటగా కలిసివున్నాయి – దబ్బ చిక్కుడు, పొడుగు చిక్కుడు, ఎర్ర చిక్కుడు అంటారు వాటిని! సదుపదేశాల్లో భర్తృహరిసుభాషితాల కున్న స్థానం ఎలాంటిదో, బలవర్ధక ఆహార పదార్థాల్లో చిక్కుళ్ళ కున్న స్థానం అలాంటిది. ఇదిగో, వంగతోట దగ్గరికి వచ్చేశాము. వంకాయలాంటి కూర లేదన్నది నేను చెప్పినమాట కాదు. అనుదినాహారానికి యింతకంటే ఉపయుక్తమైన కూరగాయ మరొకటిలేదు అందుకే ఈ వంగతోట పేరు సుమతి. అలా చూడు రాజూ! అవే వేమన పద్యాలు."

నరసప్పగారు వేమనపద్యాలంటూ నిర్దేశించి చూపినచోట మిరపచెట్ల పాదులున్నాయి. జనుల వాడుకలో వాటిపేరు గోలకొండ మిరపకాయలు. చూడ్డానికవి దమ్మిడీకాసంతవి. నేరకపోయి, ఒక కాయ నోట్లో వేసుకుంటే కారం నసాళాని కంటి, నాలుగు చెంబుల మంచినీళ్ళు గ్రుక్కపట్టి త్రాగేయవలసి వుంటుంది.

ఆపాటికి మేము పంటపొలాలకు దగ్గరగా వచ్చేశాము. కంచెకు లోబడి అర్ధచంద్రాకారం వున్న ఆ పల్లపునేల నాలు గెకరాల విస్తీర్ణ ముంటుంది. రెండంతస్థులుగా ఏర్పాటు చేసివున్న ఆ మాగాణి దిగువభాగంలో వున్నది చెరకు తోట; పై భాగమంతా వరిపైరు.

"నా కున్న భూస్థితి యిదేరా రాజూ! కండ గలిగిన నేల కావడంవల్ల శ్రమ పడినకొద్దీ ఫలితం దక్కుతుంది. ఏ పంటయినా బాగా పండుతుంది."

"'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అన్నారు గదండీ మేష్టరుగారూ! మీ భూమి మీకు బువ్వ పెట్టడాన్ని గురించి నాకు సందేహం లేదు. కానీ ఎటొచ్చీ మీరు నాకుమాత్రం యింతదూరం వెదుక్కుంటూ వచ్చానన్న నెనరయినా లేకుండా అరకొరగానే భోజనం పెట్టారు."

"ఏమిట్రా రాజూ!" తెల్లబోతూ అడిగారు నరసప్పగారు.

"కాకపోతే ఏమిటండీ మేష్టరుగారూ! విస్తరిమాత్రం పెద్దదిగానే వేశారు. కొబ్బరి దగ్గరినుంచీ ప్రారంభించి అరటి, మామిడి, నిమ్మ అంటూ కొన్ని పళ్ళు వడ్డించి, కాకర, వంకాయ, మిరప వగైరా కూరగాయలతోనే సరిపెడుతూ, అదే భోజనమంటే ఎలాకుదురుతుంది?"

"భలేవాడివిరా రాజూ! మిగిలిన సాదృశ్యాలు నీ వూహకే వదిలిపెడదామనుకున్నాను. ఈ పొలంలో చెరకు తోట లేకపోలేదు! ద్విపదల దగ్గరినుంచీ ప్రారంభించి గేయవాఙ్మయమంతా చెరకుతోటే ననుకోరాదా? వరిపైరు కళ్ళకు కొట్టవచ్చినట్టుగా కనిపిస్తూనే వుందిగదా! ఎవరి ఆకలికి తగినట్టుగా

వారీరోజుల్లో సేవిస్తున్న కథలు, నవలలు మొదలైనవన్నీ ఈ వరిపంట క్రిందనే జమకట్టుకోగూడదా?"

"ఇప్పుడైనా మీరు పెట్టింది సంపూర్ణాహారమనిపించుకోదు. ఎలాగంటారా మేష్టరుగారూ! ఏదీ చూపించండి చూద్దాం; డిటెక్టివ్ సాహిత్యం ఎక్కడ?"

"ప్రయత్నించని దోషం నాదికాదురా రాజూ! ఈ పొలాల్లో ఆ పంట మాత్రం పండింది గాదు. జీవితంలో నాకు నెరవేరని కోరికలు రెండే! మొదటిది: తీరా మారా ఒక డిటెక్టివ్ నవలను చదివి ముగించడం. రెండోది; ఈ పొలంలో పొగాకు పండించడం..."

ఆ దెబ్బనుంచి నే నింకా కోలుకోనే లేదు. నరసప్పగారు చురకపైన మళ్ళీ ఒక చురక అంటించారు.

"ఐనా నాకు తెలియక అడుగుతానురా రాజూ! మీ ఆధునికులు పొగాకునుగూడా ఆహారపదార్థంక్రింద లెక్కగట్టేశారా ఏమిటి?"

నరసప్పగారు నవ్వసాగారు. ఆ బోసినోటి నవ్వులు ఓ వెలుగు వెలిగి ఆరిపోయేసరికి చుట్టూరా చిమ్మచీకటే మిగిలింది.

"క్షణాల్లో చీకటి పడిపోయింది. నువ్వు ముందుకొచ్చి నాకు కాస్త దారి చూపించాలిరా రాజూ!"

చీకటిలో సన్నటి గనుమలపైన నడవడం సర్కస్ ఫీట్‌లాంటిపని. కంచె దాటుకుని డొంకదారిలోకి వచ్చేసరికి పదినిమిషాలు పట్టింది. ఉండివుండీ నరసప్పగారొక మాట అన్నారు.

"ఏదో మాటవరుసకు కర్తృత్వాన్నంతా నా పైన వేసుకున్నానంతేగానీ, పొలాలు సాగుచేయడానికి ఈ శరీరంలో జవసత్వా లెక్కడున్నాయిరా రాజూ! జీవశక్తిలో ఎక్కువభాగాన్ని నేనా సాహిత్యానికే ధారపోశానో, ఈ పొలాలకే ధారపోశానో ఆ భగవంతుడికే ఎరుక!''

ఏ పూర్వస్మృతుల్లో మునిగిపోయారోగానీ ఆయన మళ్ళీ మౌనం వహించారు.

తూట్లుపడిన నల్లటి డేరాలాంటి ఆకాశం క్రింద ఈవలా ఆవలా దట్టంగా అల్లుకున్న పొదలమధ్య సన్నటిదారిగుండా నడుస్తున్నాము. దగ్గరలో ఎక్కడో కీచురాళ్ళు గీ పెడుతున్న సవ్వడి పొదల్లో ఏదో సర్రున జారిపోతున్న అలికిడి. అంతకు మినహాగా స్తబ్ధమైపోయినట్టున్న ఆ నీరవప్రకృతి సీమలో మా అడుగుల సవ్వడిగూడా మాకు స్పష్టంగా వినిపిస్తోంది.

ఉన్నట్టుండి నరసప్పగారు 'ఇష్షబ్బా!' అంటూ నిట్టూర్చినట్టుగా తోచి వెనుదిరిగి చూచాను.

అడ్డు తగిలిన రాతికి తాకడంతో బొటనవ్రేలికి బాగా దెబ్బతగిలినట్టుంది. మడిమలదగ్గర కాలిని నొక్కిపట్టుకుని ఆయన బాధను దిగమ్రింగుకుంటున్నారు.





"బలంగా తగల్లేదు కదండీ?'' వంగి చూస్తూ అడిగాను.

"పరవాలేదు. చిన్నదెబ్బే. గోరు కాస్త ఎగిరిపోయినట్టుంది. ఐనా ఈ మాత్రం దెబ్బకే తట్టుకోలేకపోతే ఇక జీవితంలో తల బొప్పెలుకట్టే ఎదురుదెబ్బల మాట ఏమిటి? ఈ మధ్య చూపు తిన్నగా ఆనడం లేదు. ప్రొద్దుండగానే గూడు చేరుకునేవాణ్ణి. ఆలస్యమైతే నరసింహులు లాంతరా పట్టుకొచ్చేసేవాడు. నరసింహులంటే మా పాలేరు. భూతపతికి భృంగిరిటిలా నాకు నరసింహులు దొరికాడు. గంపెడు బిడ్డల సంసారం వాడిది. 'బిడ్డ లెందరురా నరసింహులూ!' అంటే ఠకీమని చెప్పలేడుగానీ, నిమ్మచెట్లో ఒక కాయ తగ్గితే చప్పున పసిగట్టగలడు...''

ఊరు దగ్గరపడింది.

సందు మొగదలలోనే భర్త రాకకోసం వేచి చూస్తోంది తులశమ్మ.

"ఎంతగా అబ్బాయితో మాటల్లో పడితేమాత్రం ప్రొద్దు పోయేదీ వచ్చేదీ తెలియదటండీ?"

''నిజంగానే తెలిసిందిగాదు. ఒకవేళ తెలిసినా తోడుగా అబ్బాయి వున్నాడుగనుక మరేం భయం లేదనుకున్నానేమో?"

"మంచిపని చేశారుగానీ పొంతపైన వేడినీళ్ళున్నాయి. కాళ్ళుచేతులు కడుక్కుని మీపనులన్నీ ముగించండి. భోజనాలు వడ్డిస్తాను..."

అవతల బంధువు నాకోసం వేచి వుంటాడుగనుక భోజనానంతరం కలుసుకుంటానని చెప్పి సెలవు తీసుకోడానికి ప్రయత్నించాను.

నరసప్పగారు ససేమిరా వీల్లేదు అన్నారు. "బాగుందిలే వరస! పొలాల్లో వుత్తుత్తి భోజనం పెట్టి, నిజం భోజనం మాట వచ్చేసరికి నిన్ను వదిలించుకోమంటావట్రా రాజూ! అదేం వీలుకాదు. ఈ వూరిలో మాకు ఏడేళ్ళకుగానీ ఒక అతిధి దొరకడు. ఈపూట నువ్విక్కడే భోజనం చేయాలి..."

పెరట్లోకి వెళ్ళి ముఖప్రక్షాళనం గావించుకుని తిరిగివచ్చారు నరసప్పగారు. అది అయిదంకణాల పూరిల్లు. అందులో రెండంకణాల మేరకు అదొక గదిగా ప్రత్యేకింపబడింది. తలుపు త్రోసి లోపలికి అడుగుపెడుతూ "వస్తావుట్రా రాజూ!" అన్నారు.

లోపలికి ప్రవేశించకమునుపే అది దేవరిల్లులాంటిదని అర్థమైంది. కానీ దానినంత విందుగా సంతరించుకోడానికి వెనుకనున్న ప్రయత్నం ఏపాటి దన్న విషయం లోపలికి వెళ్ళిన తర్వాతగానీ తెలిసిందిగాదు. ద్వారాని కెదురుగా వున్న గోడ కానుకుని గోడ పొడుగునా ఒక సన్నటి అరుగు. ఆ అరుగుపైన ఈ చివర పరమశివుని పాలరాతి విగ్రహం; ఆ చివర కరుణారసం రూపు దాల్చినట్టున్న బుద్ధభగవానుడి సుందర

మూర్తి; మధ్యలో సీతాలక్ష్మణ సహితుడైన కోదండరాముడు. ఆ రాముని పాదసన్నిధిలో మోకరించి కూర్చున్నట్టున్న హనుమద్విగ్రహం. ఇవిగాక మహత్తర పౌరాణిక సంఘటనలను జ్ఞప్తికి తెస్తూ గంగావతరణం, గోవర్ధనోద్ధరణా, శివధనుర్భంగం, గీతా ప్రబోధం లాంటి పటాలు గోడలకు వ్రేలాడుతున్నాయి.

కానీ నా చూపు ఎంతోసేపు ఆ దేవతామూర్తులపైన నిలిచివుండలేదు. గదిలో ఒక గోడను పూర్తిగా దృక్పథం నుంచి తప్పించివేస్తూ నిల్చున్న బీరువాల్లో అందంగా అట్టలు తొడుక్కుని, ముచ్చటగా నామాక్షరాలు లిఖింపబడి, యితిహాసాలనుండి శతకాల వరకూ విస్తరించివున్న పుస్తకాల ప్రపంచం–అదొక సరస్వతీ సామ్రాజ్యంలా కనిపిస్తోంది.

నరసప్పగారు దీపాలు వెలిగించారు. అగరువత్తులు ముట్టించారు. ఒకటిరెండు నిమిషాలపాటు అర్ధనిమీలిత నేత్రాలతో నిశ్చలంగా వుండిపోయి, తర్వాత హఠాత్తుగా తల పైకెత్తి నా వైపు చూచారు.

ఆ చూచిన చూపుల్లో ఏదో చెప్పదలచుకున్నా రన్న యింగితం స్ఫురించింది.

'ఏమిటండీ మేష్టరుగారూ!' అనబోయాను, కానీ అనలేదు.

"జీవితంలో ఏ సమస్యకైతే పరిష్కారాన్ని ఊహించలేకపోయానో, దానికీనాడు పరిష్కారం కుదిరింది."

అర్థం కావడంలేదు.

"చూస్తున్నావుగా! నా వయసుడిగిపోయింది. నన్ను నమ్ముకున్నవాళ్ళకందరికీ నేను వేరొక ఆశ్రయాన్ని చూపించవలసిన సమయం సమాసన్నమైంది. ముదిమిలో తల్లిదండ్రులకు బిడ్డలే దిక్కు. నాకా బిడ్డలు లేరు. మా ఆవిడకు పొలాల్ని చూపించి వెళ్తున్నాను. ఆ పొలాలకు నరసింహుల్ని చూపించి వెళ్తున్నాను. ఎటొచ్చీ ఈ పుస్తకాల విషయమే నాకొక సమస్యగా వుండిపోయింది."

అర్థంగాక అయోమయంగానే ఆయన వంక చూస్తున్నాను.

"నాదొక అజ్ఞాత ప్రపంచం. నా చిరునామా అయినా నీకు తెలియదు. భగవంతుడిలా నిన్నిక్కడికి లాక్కొచ్చాడంటే యిది నిష్కారణంగా జరిగివుంటుం దనుకోను."

దగ్గరగా వచ్చి నా చేతులు రెండింటినీ తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నారు—

"వీటిని నీ కప్పగిస్తున్నాను. నా పుస్తకాలను ప్రాణప్రదంగా చూసుకుంటావా రాజూ?"

నరసప్పగారి కంఠం గాద్గదికం అయిపోయింది.

# ఉద్యోగమా — సంసారమా!



కుమారి నంద

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోని వాంటెడ్ కాలమ్స్ అన్నీ తిరగేసింది నిర్మల. టీచర్సు కావాలని వేసిన ప్రకటనను చదివి బి. ఎ. బి. ఇడి. టీచరుపోస్టుకు అప్లయి చేసింది. ఎందుకైనా మంచిదని ఈ విషయం భర్తకు చెప్పలేదు. పదిరోజులు గడిచిన తర్వాత జాయినవమని ఆర్డర్సు వచ్చాయి. ఆ సాయంత్రం ఆఫీసునుండి